క్లుప్తంగా

శిథిలావస్థలో వాటర్‌ట్యాంక్



చేర్వాపూర్‌లోని వాటర్ ట్యాంక్

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్‌లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. 30 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ పెచ్చులూడుతున్నాయి. ట్యాంక్ పిల్లర్ల సిమెంట్ పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు తేలి తుప్పుపట్టాయి. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల సమీపంలో ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తలంబ్రాలు బుకింగ్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలు బుకింగ్ వాల్ పోస్టర్‌ను బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన జరిగే శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలు కావల్సిన వారు హుస్నాబాద్ ఆర్టీసీ కార్గో సెంటర్‌లో రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలన్నారు. తలంబ్రాలు డోర్ డెలివరీ చేస్తామని తెలిపారు.

పొద్దుతిరుగుడు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పొద్దుతిరుగుడు విత్తనాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని చిన్నకోడూరు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. బుధవారం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. పొద్దుతిరుగుడు విత్తనాలను కేంద్రాలకు తెచ్చి పది రోజులవుతున్నా కొనుగోలు చేయడం లేదని, కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామన్నారు. అధికారులు స్పందించి వెంటనే పొద్దుతిరుగుడు విత్తనాలను కొనుగోలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన



పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఆర్డీఓ రామ్మూర్తి బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. గత వారం జరిగిన పీడబ్ల్యూడీ ఓటర్స్, సిటిజన్ ఓటర్స్‌పై ఎన్నికల పోలింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ పత్రాల గురించి వివరించారు. ఈ పత్రాలను జత చేసి రాజకీయ పార్టీల నాయకులకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కేడం లింగమూర్తి, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి చిట్టి గోపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి దొడ్డి శ్రీనివాస్, బీఎస్పీ నుంచి వెల్పుల రాజు పాల్గొన్నారు.

యువగర్జన సభను జయప్రదం చేయండి

తొగుట(దుబ్బాక): దౌల్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్‌ఎస్ యువగర్జన సభను విజయవంతంచేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువనేత తీపిరెడ్డి మహేష్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13వ తేదీన యువ గర్జనసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు స్వామి, సురేష్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ కుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..

- రెండేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్
- స్థానిక నాయకత్వ లోపంతో ముందుగు సాగని పనులు
- విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి అందని నష్ట పరిహారం

కొండపాక(గజ్వేల్): అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తోడు స్థానిక నాయకత్వ లోపం కారణంగా రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లుగా జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన కొండపాకలో 2017–18లో పంచాయతీ రాజ్ శాఖ నిధుల నుంచి రూ.3.40 కోట్లు కేటాయిస్తూ రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విస్తరణ పనులను హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. కొండపాక గ్రామానికి చుట్టూ భారీ వాహనాల రాకపోకలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా గ్రామం మధ్యలో రోడ్డును వెడల్పు చేయాలని నిర్ణయించారు. అయితే తమ ఇళ్లు, స్థలాలు కోల్పోవాల్సి వస్తుందని గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో పనుల ప్రారంభానికి బ్రేక్ పడింది. దీంతో 2018లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సతీమణి చిట్టి మాధురిరెడ్డి గెలుపొందడంతో మళ్లీ రోడ్డు విస్తరణ పనుల అంశం తెర మీదకి వచ్చింది. విస్తరణ జరిగితే గ్రామం అభివృద్ధి చెందుతుందని, విస్తరణలో నష్టపోయిన వారికి ప్రభుత్వ పరంగా లబ్ధి చేకూరేలా చూస్తామంటూ గ్రామస్తులను ఒప్పించారు. 2022 మార్చిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్ల కూల్చివేత పనులు ప్రారంభించారు.

కోర్టును ఆశ్రయించిన బాధితులు

కొండపాకలో భవిష్యత్ అవసరాల నిమిత్తం వంద అడుగుల బీటీ రోడ్డుగా మార్చాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి నిర్ణయించారు. వంద ఫీట్లుతో గ్రామ అభివృద్ధి కోసం రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు గ్రామస్తులను ఒప్పించారు. ఇళ్లు, స్థలాలు నష్టపోయినవారికి నష్టపరిహారం చెల్లిస్తామని హామీలు గుప్పించారు. రోడ్డు విస్తరణలో తాము పూర్తిగా నష్టపోతామని కొందరు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటికే కూల్చివేతల్లో మురికి కాల్వలు ధ్వంసం కావడంతో మురుగు రోడ్లపై పారుతుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.



కొండపాకలో ఇంటిని కూలుస్తున్న దృశ్యం

నష్టపోతామని 60 లేదా 80 ఫీట్లకు కుదించాలని నిర్వాసితులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా పనులు ప్రారంభించారు. తమ అభిప్రాయం లెక్కలోకి తీసుకోకుండా, నష్ట పరిహారం ఇవ్వకుండా కూల్చివేస్తున్నారని కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో కూల్చివేత పనులు నిలిచిపోయాయి. కూల్చివేతల్లో మురికి కాల్వలు ధ్వంసం కావడంతో మురుగు రోడ్లపై పారుతోంది.

డబుల్ బెడ్రూంలు రాలేదు

కొండపాకలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వంద డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించింది. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామన్న నాయకులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో బాధితులు ఆందోళనకు దిగారు. పోలీసు పహారాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ మండల ఏఈ తిరుపతిరెడ్డిని వివరణ కోరగా కొందరు కోర్టుకు వెళ్లడం కారణంగా విస్తరణ పనులు ఆలస్యంగా జరుగుతున్న విషయం వాస్తవమేనన్నారు. త్వరలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితుడు (ఫైల్)

ఉద్దెర పథకాలుగా మార్చిన సర్కార్

- బండి సంజయ్ కరీంనగర్‌కు నయాపైసా తేలేదు
- నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత
- తాను ఎంపీగా జాతీయ రహదారులు, రైల్వే లైన్లు తెచ్చా
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్



వాకర్స్‌తో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

హుస్నాబాద్: గ్యాస్ సిలిండర్ నువ్వు కొనుక్కో తరువాత సబ్సిడీ ఇస్తానన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ పథకాలను ఉద్దెర పథకాలుగా మార్చిందని కరీంనగర్ ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవ చేశారు. హుస్నాబాద్ పట్టణంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఎల్లమ్మ చెరువు కట్టపై వాకర్స్‌తో మాట్లాడారు. పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టి ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసిందన్నారు. యాసంగి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చుడే కానీ, వాటిని నేరవేర్చడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. పదేళ్లలో చూడని కరువు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే చూస్తున్నారన్నారు. ఎండిన ప్రతీ ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు, అంగన్‌వాడీ సెంటర్లకు గుడ్లు, పాలు, కేంద్ర పథకాలకు ఏటా వచ్చే నిధులు ఎంపీ బండి సంజయ్ తెచ్చినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి నయా పైసా నిధులు తేలేదని ఆరోపించారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్లు తాను తెచ్చానన్నారు. మళ్లీ ఎంపీగా గెలిపిస్తే 23 నవోదయ పాఠశాలలు తెస్తానని, ఇందులో హుస్నాబాద్‌లో ఒక పాఠశాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీ మాలోతు లక్ష్మి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ బీలు నాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కోహెడ(హుస్నాబాద్): రానున్న లోక్‌సభ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో హాజరై మాట్లాడారు. కొందరు పార్టీని వీడినంతమాత్రాన పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు.

నీలం విజయానికి కృషి చేస్తా



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీశైలం ముదిరాజ్

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ గెలుపు కోసం కృషి చేస్తానని తెలంగాణ ఉద్యమకారుడు శ్రీశైలం ముదిరాజ్ అన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థిగా బీసీని ఎంపిక చేసినందుకు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. కాంగ్రెస్ గెలుపుకోసం కృషి చేస్తానని సీఎంకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు సైబర్ అంబాసిడర్ బ్యాడ్జీలు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బక్రిచెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన సైబర్ అంబాసిడర్ ప్లాట్ ఫారం కోర్సులో ప్రతిభ కనబరిచిన వారికి బుధవారం సైబర్ అంబాసిడర్ ప్రశంసాపత్రాలు, బ్యాడ్జీలు సీఐ విద్యాసాగర్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

సిద్దిపేటఅర్బన్: గ్రామస్తులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేయడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన వంగ సంతోష్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం రూ. 2 లక్షల విలువైన వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజయ్య, మాజీ ఉప సర్పంచ్ రాజవెంకట్‌రెడ్డి, వంగ సురేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ తనిఖీ

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని శ్రీగిరిపల్లి పీహెచ్‌సీని డీఎంఅండ్‌హెచ్‌ఓ (జిల్లా వైద్య ఆరోగ్యశాఖ) అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, ఆసుపత్రి రికార్డులు, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సమయ పాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు, గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఆసుపత్రిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అవసరమయ్యే ఫ్లూయిడ్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, గజ్వేల్ వైద్యాధికారులున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతే

మెదక్ బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



బొప్పాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాక: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతేనని మెదక్ బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం తన స్వగ్రామం అక్బర్‌పేట–భూంపల్లి మండలం బొప్పాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి పేరుపేరున ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో మళ్లీ బీజేపీ అఖండ మెజార్టీతో అధికారంలోకి రాబోతుందన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ కథ ముగిసిందని, ఆచరణకు సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ప్రజల కోసం పాటుపడే వారినే గెలిపించాలని కోరారు.

నేడు బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ మండల సన్నాహక సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిధి పెద్దకోడూరులోని రేణుకా మాత ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ తెలిపారు. బుధవారం సన్నాహక సభాస్థలిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్‌లు కనకరాజు, సదానందం, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్

జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్

జగదేవ్‌పూర్ (గజ్వేల్): రైతులకు ఫర్టిలైజర్ డీలర్లు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని మునిగడప, వట్టిపల్లి, జగదేవ్‌పూర్ ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఎరువుల దుకాణాలకు అనుమతులిచ్చిందన్నారు. ఎరువులు, మందులను విత్తన చట్టాల నిబంధనల ప్రకారం విక్రయించాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ధరలకు జీలుగ విత్తనాలను అందజేస్తుందని, రైతులు ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది సంబరాలు



సిద్దిపేట బడిపిల్లల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మల్లినాథసూరి తెలుగు శాఖ, జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట సంయుక్తంగా బుధవారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సంవత్సరం ప్రకృతి కొత్తదనం నింపుతూ నూతనత్వం పంచుతుందన్నారు. 30 మంది సిద్దిపేట కవులు, కళాశాల విద్యార్థులు కవితాగానం చేశారు. అనంతరం సిద్దిపేట బడిపిల్లల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తెలుగు విభాగం అధ్యక్షుడు మహేందర్, కవులు మాడుగుల మురళీధరశర్మ, పప్పుల రాజిరెడ్డి, శ్రీనివాస్, బస్వ రాజ్ కుమార్, శివకుమార్, సరస్వతీ, లక్ష్మీ, జలజారాణి, మాధవీలత, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ ఆదేశాల ప్రకారమే ఎన్నిక

చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

చేర్యాల(సిద్దిపేట): బార్ కౌన్సిల్ నియమ నిబంధనల ప్రకారం, సీనియర్ న్యాయవాదుల సూచనల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నామని, ఉద్దేశపూర్వకంగా కొంతమంది న్యాయవాదులు అడహక్ కమిటీ పేరుతో తమపై దుష్ప్రచారం చేస్తున్నారని చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమిగారి మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరి సహకారంతో త్వరలో చేర్యాలలో కోర్టు ప్రారంభమవుతుందన్నారు. చేర్యాలలో కోర్టు రావడానికి న్యాయవాదులందరి కృషి ఉందన్నారు. ప్రస్తుతం కోర్టు ఏర్పాటు ఫైలు ఫైనాన్స్ సెక్రటరీ వద్ద ఉందన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కాటం సురేందర్, ప్రధాన కార్యదర్శి తాటికొండ ప్రణీత్, సహాయ కార్యదర్శి పర్వతం రాములు, కోశాధికారి అంకాని సురేందర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఉట్కూరి అమర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వేలం పాటల ఆదాయం రూ.9.21లక్షలు

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో టెంకాయలు, పూజాసామగ్రి, తైబజార్ తదితర విక్రయాలకు నిర్వహించిన వేలం పాటలలో రూ.9.21 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. బెజ్జంకిలో బుధవారం నిర్వహించిన వేలం పాటలలో టెంకాయల విక్రయానికి రూ.2.08 లక్షలు, లడ్డూ, పులిహోర విక్రయాలకు రూ.4.7 లక్షలు, తైబజార్‌కు రూ.1.06 లక్షలు, దైవ దర్శనానికి రూ.1.78 లక్షలు, దివిటీలు, పేలాలు, పుట్నాలకు రూ.22,100 వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది రూ.7,37,600 రాగా ఈ సారి రూ.1,83,500 అదనంగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చలివేంద్రం ప్రారంభం

మిరుదొడ్డి(దుబ్బాక): బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మొగుళ్ళ ఐలయ్య తెలిపారు. బుధశారం మండల కేంద్రమైన మిరుదొడ్డిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ముగిసే వరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అక్బర్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అక్బర్ బాషా నియమితులయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం సైనికుడిలా పనిచేస్తానన్నారు.

◆ సదానందాశ్రమంలో ప్రత్యేక పూజలు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధి ఆరెపల్లి శివారులోని సదానందాశ్రమంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమంలో సదానంద పాదుకా పూజలు, అభిషేకాలు, బిల్వార్చన, సామూహిక పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సదానంద శిష్య బృందం, భజన బృందం తదితరులు పాల్గొన్నారు.

◆ నేత్రదానంతో మరొకరికి కంటిచూపు

గజ్వేల్‌రూరల్: నేత్రదానంతో మరొకరికి కంటి చూపు అందించవచ్చని నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. పట్టణానికి చెందిన గోలి కళావతి(90) మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి కళావతి నేత్రదానానికి సహకరించాలని కోరారు. గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు మృతురాలి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో గజ్వేల్ కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ధి భిక్షపతి, కొండపోచమ్మ దేవాలయ మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యుడు రవీందర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

గజ్వేల్‌రూరల్: మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ నాయకుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ఓట్లడిగేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులు నిలదీయాలన్నారు. గజ్వేల్ ప్రాంత అభివృద్ధిలో ముఖ్యభూమిక పోషించిన బీఆర్‌ఎస్ నేత వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

◆ గోటి తలంబ్రాల కార్యక్రమం అభినందనీయం

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో చేపట్టిన గోటి తలంబ్రాల కార్యక్రమం అభినందనీయమని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో గోటి తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గోటి తలంబ్రాల కార్యక్రమంలో ప్రతీ ఒక్కరిని భాగస్వాములను చేస్తూ ఈ ప్రాంతానికి గుర్తింపు తెస్తున్న రామకోటి రామరాజును అభినందించారు. భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో పాలు పంచుకునే అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు.

◆ రంజాన్ తోఫా పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంజాన్ పండగను పురస్కరించుకొని 3వ వార్డు బీఆర్‌ఎస్ నాయకుడు వంగ తిరుమల్‌రెడ్డి ముస్లింలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దబ్బెట శ్రీనివాస్, పొట్లచెర్వు ఆంజనేయులు, నిమ్మ మహేందర్ రెడ్డి, ఐరేణి మల్లేశం, రొంపల్లి నరేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ నేపాల్ యాత్ర పుస్తకావిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ కవి, రచయిత డాక్టర్ సుధాకర్ రచించిన నేపాల్ యాత్ర పుస్తకాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు ఐత అంజయ్య, విక్రంరెడ్డి, మధుసూదన్, కథాశిల్పి ఐత చంద్రయ్య, కొమురవెల్లి అంజయ్య, గంగాపురం శ్రీనివాస్ , పెందోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

